

TG/TEL/25/A3731

# నిజం
## దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాదాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-241 పేజీలు:-4 శుక్రవారం 14- 08 - 2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## లష్కరే తోయిబా నేతలతో కలిసి వేదిక పంచుకున్న రషీద్

- హాఫీజ్ సయీద్‌కు నేను బానిస అంటూనే భారత్‌కు పాకిస్థాన్ మాజీ మంత్రి బెదిరింపులు
- ఉగ్రవాది హాఫీజ్ సయీద్‌కు తాను బానిసనన్న పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్
- పాకిస్థాన్ వైపు చూస్తే భారత్‌లో పక్షులు కూడా కూయవంటూ హెచ్చరిక
- రషీద్ వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్.. విమర్శల వెల్లువ



పాకిస్థాన్ మాజీ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర దుమారం రేపుతున్నాయి. ముంబై ఉగ్రదాడుల సూత్రధారి, లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ) వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు తాను 'గులాం'ను (బానిసను) అని ఆయన బహిరంగంగా ప్రకటించారు. లష్కరే తోయిబా- మిగతా 2 లో

## 250 రోజులుగా సముద్రంలోనే అమెరికా యుద్ధనౌకలో ఏం జరుగుతోంది?

- 9 నెలలుగా సముద్రంలోనే యూఎస్ఎస్ అబ్రహం లింకన్ నౌక
- 250 రోజులు తీరానికి దూరంగా ఉన్న నౌకలోని సిబ్బంది
- నావికులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడినట్లు కుటుంబాల ఆవేదన
- సుదీర్ఘ మోహరింపుతో తీవ్ర మానసిక ఒత్తిడిలో సిబ్బంది
- నీరు, ఆహారం, పారిశుద్ధ్యంపైనా కుటుంబాలు ఫిర్యాదు



ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో అమెరికా యుద్ధనౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. దాదాపు తొమ్మిది నెలలుగా సముద్రంలోనే ఉన్న నౌకలో పలువురు నావికులు ఆత్మహత్యాయత్నాలకు - మిగతా 2 లో

# గతంలో కోర్టుకెళ్లిన మీరేఇప్పుడు అవే భూములను ఎలా వేలం వేస్తారు?

- రాయదుర్గం భూముల వేలం తక్షణమే ఆపాలని సీఎంకు హరీశ్ రావు లేఖ
- అవి వారసత్వ, వివాదాస్పద భూములని లేఖలో స్పష్టీకరణ
- గతంలో ఇదే భూముల కోసం కోర్టుకెక్కిన రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్
- యాజమాన్య హక్కులు తేలకుండా వేలం వేయడంపై తీవ్ర అభ్యంతరం
- ఎస్బీఐ, వక్ఫ్ బోర్డు కేసుల నేపథ్యంలో వేలం నిర్ణయంపై విమర్శలు




హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని అత్యంత విలువైన రాయదుర్గంలో 10.63 ఎకరాల వారసత్వ భూమి వేలాన్ని తక్షణమే నిలిపివేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశం



- శ్రీరామకుంట వైకుంఠధామాన్ని ఆహ్లాదకరమైన పార్కు తరహాలో తీర్చిదిద్దుతున్నాం: హరీశ్ రావు
- సిద్దిపేట శ్రీరామకుంట వైకుంఠధామం పనులను పర్యవేక్షించిన హరీశ్
- పనులు జరగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన మాజీ మంత్రి

సిద్దిపేట శ్రీరామకుంట వైకుంఠధామాన్ని సరికొత్త రీతిలో ఒక ఆహ్లాదకరమైన పార్కు- మిగతా 2 లో

## చంచల్‌గూడ స్టీల్ బ్రిడ్జ్‌కు సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి



- చంచల్‌గూడ నుంచి సంతోష్‌నగర్ వరకు కొత్త స్టీల్ బ్రిడ్జ్
- సంగం లక్ష్మీబాయి సేవలు చరిత్రలో మరుపురానివన్న వీహెచ్
- మూడుసార్లు ఎంపీగా గెలిచిన తొలి మహిళగా రికార్డు సృష్టించారని కితాబు

హైదరాబాద్ నగర పరిధిలోని చంచల్‌గూడ నుంచి సంతోష్‌నగర్ వరకు నూతనంగా నిర్మించిన స్టీల్ బ్రిడ్జ్‌కు - మిగతా 2 లో

## విదేశాంగ విధానమంటే ఆలింగనాలు కాదు




- ప్రధాని నరేంద్ర మోదీ తీరుపై రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు
- వేదికపైనే కాంగ్రెస్ నేతను కౌగిలించుకుని సెటైర్
- చైనా, ఇరాన్ విషయంలో భారత వైఖరిని తప్పుపట్టిన రాహుల్
- బీజేపీ, ఆరెస్సెస్‌ను జోకర్ల బృందంగా అభివర్ణన

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత - మిగతా 2 లో

# సభలో తొలిసారి వందేమాతరం
# ఆరు చరణాల ఆలాపన

- ముగిసిన వర్షాకాల సమావేశాలు
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా గురువారం లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది
- ఈ రోజు లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు
- ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష
- నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు.




పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా గురువారం లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. ఈ రోజు లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు.

## ఖర్గే సభ జరిగిన చోట 'శుద్ధి' రాజ్యసభలో రగడ నడ్డా ఏమన్నారంటే..!



- ఖర్గే సభ జరిగిన చోట శుద్ధీకరణ హోమం
- రాజ్యసభలో ఖర్గే తీవ్ర అభ్యంతరం
- ఘటన దురదృష్టకరమన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా
- బీజేపీకి ఆ కార్యక్రమంతో సంబంధం లేదన్న నడ్డా
- ఘటనపై విచారణ జరుపుతామని హామీ

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన ప్రదేశంలో 'శుద్ధీకరణ' పేరుతో హోమం - మిగతా 2 లో

## ఇవాళ జైలులో నన్ను కూడా అవమానించారు



- కర్నూలు జైలులో ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించిన జగన్
- చంద్రబాబు రెడ్ బుక్ పాలనతో ప్రతిపక్షాన్ని అణిచివేస్తున్నారని ఆరోపణ
- బాధితులే నిందితులుగా మారుతున్నారని, విరూపాక్షి ఘటనే ఉదాహరణ అన్న జగన్
- బీసీ, మైనారిటీ నేతలను లక్ష్యంగా చేసుకుని కేసులు పెడుతున్నారని విమర్శ
- తాను నాటిన తప్పుడు విత్తనాలే రేపు చంద్రబాబును చుట్టుకుంటాయని హెచ్చరిక

రాష్ట్రంలో అధికార దుర్వినియోగం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి - మిగతా 2 లో

## ఖర్గేకు అవమానం రాష్ట్రవ్యాప్త నిరసనలకు షర్మిల పిలుపు



- ఖర్గే పర్యటించిన స్థలాన్ని శుద్ధి చేయడంపై షర్మిల తీవ్ర ఆగ్రహం
- ఇది దళితుల వ్యక్తిత్వానికి జరిగిన అవమానమంటూ విమర్శ
- బీజేపీ కుల వివక్షకు, విభజన రాజకీయాలకు నిదర్శనమని ఆరోపణ
- ఆగస్టు 14న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, సత్యాగ్రహానికి పిలుపు

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు అవమానం - మిగతా 2 లో

# సీడ్ యాక్సెస్ రోడ్డు.. నూతన స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించిన చంద్రబాబు

- సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవం
- అమరావతి రైతులది త్యాగం మాత్రమే కాదు.. భవిష్యత్ తరాలకు స్ఫూర్తి అన్న చంద్రబాబు
- శూన్యం నుంచి గొప్ప రాజధానిని నిర్మించుకునే స్థాయికి చేరుకున్నామని వ్యాఖ్య
- గ్రాఫిక్స్ అన్నవాళ్లు ఇక్కడకు వచ్చి చూడాలన్న చంద్రబాబు




ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో సువర్ణాధ్యాయం ఆవిష్కృతమైంది. రాజధాని రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ఈ-3 సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో దశతో పాటు, విజయవాడ-మంగళగిరి హైవేను

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
శుక్రవారం 14- 08 - 2026

## ఖర్గేకు అవమానం.. రాష్ట్రవ్యాప్త నిరసనలకు షర్మిల పిలుపు

మొదటిపేజీ తరువాయి – జరిగిందంటూ, బీజేపీపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానిలో ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని బీజేపీ, హిందుత్వ సంస్థలు గంగాజలంతో శుద్ధి చేయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది బీజేపీ కుల దురహంకారానికి, దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని ఆరోపిస్తూ రేపు (ఆగస్టు 14) రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చారు. ఈ ఘటనపై షర్మిల తీవ్రంగా స్పందించారు. “బీజేపీ చేసిన హవనం.. దళితుల వ్యక్తిత్వానికి జరిగిన హననం” అని ఆమె అభివర్ణించారు. దళితుల పట్ల వివక్ష చూపడమే బీజేపీ సిద్ధాంతమని, కులమతాల మధ్య విభేదాలు సృష్టించడం ఆ పార్టీ మనస్తత్వమని విమర్శించారు. రామ్ లీలా మైదానంలో ఖర్గే అడుగుపెట్టిన స్థలాన్ని శుద్ధి చేయడం బీజేపీ పాటిస్తున్న అంటరానితనానికి, అసమానతలకు అద్దం పడుతుందని ఆమె మండిపడ్డారు. ఇది సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకోవాల్సిన చర్య అని, రాజ్యాంగ విలువలను తునాతునకలు చేసే ఈ రాక్షస చర్యను యావత్ దేశం ఖండిస్తోందని తెలిపారు. ఈ సిగ్గుమాలిన చర్యను నిరసిస్తూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఉద్యమిస్తోందని, అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు షర్మిల ప్రకటించారు. ఆగస్టు 14వ తేదీ సాయంత్రం ప్రతి జిల్లా కేంద్రంలో డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఆధ్వర్యంలో భారీ మార్చ్, సత్యాగ్రహం నిర్వహించాలని ఆమె పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఈ మార్చ్‌ను స్థానిక అంబేద్కర్ లేదా గాంధీ విగ్రహాల వద్ద ముగించి, ఖర్గేకు సంఘీభావంగా సత్యాగ్రహం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీ, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలు, పార్టీ అనుబంధ విభాగాలు, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని షర్మిల కోరారు. ఇటువంటి వివక్ష, విభజన కుట్రలను దేశ ప్రజలు సహించబోరని బీజేపీకి శక్తివంతమైన సందేశం పంపాలని ఆమె పిలుపునిచ్చారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశం

మొదటిపేజీ తరువాయి – తరహాలో తీర్చిదిద్దుతున్నామని మాజీ మంత్రి, స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. సిద్దిపేట పట్టణ పరిధిలోని శ్రీరామకుంట శ్మశానవాటికలో సాగుతున్న సుందరీకరణ పనులను ఆయన ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన... మిగిలిన పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. శ్మశానవాటిక ప్రాంగణంలో పచ్చదనం పెంచేలా మరిన్ని మొక్కలు నాటాలని హరీశ్ సూచించారు. ప్రజల రాకపోకలకు వీలుగా సీసీ రోడ్లు, భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో దహన సంస్కారాల కోసం వచ్చే ప్రజలు వెలుతురు లేక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా... వెంటనే సరైన లైటింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. వీటితో పాటు టాయిలెట్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టి శుభ్రత ఉండేలా చూడాలన్నారు. పర్యావరణహిత పద్ధతిలో బయోగ్యాస్ ద్వారా దహన సంస్కారాలు నిర్వహించేలా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు.

## చంచల్‌గూడ స్టీల్ బ్రిడ్జ్‌కు సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి

మొదటిపేజీ తరువాయి – ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, విద్యావేత్త సంగం లక్ష్మీబాయి పేరుతో నామకరణం చేయాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతరావు కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా లేఖ రాశారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో, ఆ తర్వాత సమాజ సేవలో సంగం లక్ష్మీబాయి అందించిన నిరుపమాన సేవలు చరిత్రలో మరపురానివని వీహెచ్ తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ నేలకు చెందిన వీరనారిగా, నిజాం నిరంకుశత్వానికి, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ఉద్యమించడమే కాకుండా, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష కూడా అనుభవించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా అల్వాల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఉప విద్యామంత్రిగా సేవలు అందించారని, మెదక్ స్థానం నుంచి వరుసగా మూడుసార్లు ఎంపీగా గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టిన తొలి మహిళగా రికార్డు సృష్టించారని వివరించారు. సైదాబాద్‌లో ‘ఇందిరా సేవా సదన్’ నెలకొల్పి వేలాది మంది పేద బాలికలకు ఆశ్రయం, విద్య అందించిన మహోన్నత వ్యక్తి ఆమె అని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దే విద్యాశాఖ ఉన్నందున, గతంలో విద్యాశాఖ మంత్రిగా సేవలందించిన సంగం లక్ష్మీబాయి పేరును చంచల్‌గూడ – సంతోష్‌నగర్ స్టీల్ బ్రిడ్జ్‌కు నామకరణం చేస్తే ప్రజామోదం లభించడంతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని వీహెచ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విజ్ఞప్తిపై తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని సీఎంను కోరారు.

## విదేశాంగ విధానమంటే ఆలింగనాలు కాదు

మొదటిపేజీ తరువాయి – రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రపంచ దేశాల అధినేతలను ఆలింగనం చేసుకోవడం, వ్యక్తిగత స్నేహాలను ప్రదర్శించడం విదేశాంగ విధానం అనిపించుకోదని, దేశ ప్రయోజనాలను కాపాడటమే అసలైన దౌత్యమని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో జరిగిన ‘రచనాత్మక్ కాంగ్రెస్’ జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విదేశాంగ విధానమంటే విదేశీ నేతలను కౌగిలించుకోవడమన్న ఆలోచన మోదీకి ఎక్కడి నుంచి వచ్చిందో అర్థం కావడం లేదని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా తన వాదనను వివరించేందుకు వేదికపై ఉన్న రచనాత్మక్ కాంగ్రెస్ చీఫ్ సందీప్ దీక్షిత్‌ను ఆయన ఆలింగనం చేసుకున్నారు. తన నాయనమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో కలిసి బాల్యంలో అమెరికా వెళ్లిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, దేశాధినేతల అధికారిక పర్యటనలు వ్యక్తిగత పర్యటనలు వంటివి కావని ఆయన పేర్కొన్నారు. ఇరాన్, అమెరికా, రష్యాలతో భారత్‌కు సుహృద్భావ సంబంధాలు ఉన్నప్పటికీ, ఇరాన్ వివాదంలో మధ్యవర్తిత్వం వహించే అరుదైన అవకాశాన్ని భారత్ కోల్పోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని సరిహద్దు ప్రాంతాల్లో భారత సైన్యం పెట్రోలింగ్‌ను చైనా అడ్డుకుంటోందని, గల్వాన్ ఘర్షణల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి దేశాన్ని బలహీనపరిచిందని ఆయన విమర్శించారు. బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)లను ఒక ‘జోకర్ల బృందం’గా అభివర్ణించిన రాహుల్ గాంధీ, ఆ సంస్థలు దేశంపై ఏకపక్ష రాజకీయ వ్యవస్థను రుద్దేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఇదే కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, పార్లమెంటులో ప్రతిపక్షాల గొంతును ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు.

## లష్కరే తోయిబా నేతలతో కలిసి వేదిక పంచుకున్న రషీద్

మొదటిపేజీ తరువాయి – కీలక నేతలతో వేదికను పంచుకుంటూనే, భారత్‌ను ఉద్దేశించి ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఒక బహిరంగ సభలో ప్రసంగించిన షేక్ రషీద్, “నేను హాఫీజ్ సాహెబ్‌కు బానిసను” అని వ్యాఖ్యానించారు. తన మొబైల్ ఫోన్‌లో హాఫీజ్ సయీద్ ఫోన్ నంబర్ ఉన్నందునే అమెరికా తనపై నిషేధం విధించిందని ఆయన పేర్కొన్నారు. లష్కరే తోయిబా సీనియర్ కమాండర్ ఖలీద్ మసూద్ సంధు, సలహా కమిటీ సభ్యుడు కారీ మహ్మద్ యాకూబ్ షేక్‌లతో కలిసి ఆయన వేదికపై కనిపించడం గమనార్హం. ఇదే సభలో భారత్‌ను ఉద్దేశించి రషీద్ విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారు. “భారత్ గనుక పాకిస్థాన్ వైపు కన్నెత్తి చూస్తే సర్వనాశనమవుతుంది. ఆ తర్వాత భారత్‌లో ఏ పక్షీ కూయదు, ఏ గుడిలోనూ గంట మోగదు” అంటూ రెచ్చగొట్టేలా హెచ్చరించారు. పాకిస్థాన్‌తో పాటు హాఫీజ్ సయీద్‌కు తాను పూర్తి మద్దతు ఇస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. షేక్ రషీద్ 2020 నుంచి 2022 వరకు ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వంలో అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. బాధ్యతాయుతమైన పదవిలో పనిచేసిన ఒక మాజీ మంత్రి, ఐక్యరాజ్యసమితి నిషేధిత ఉగ్రవాదికి బహిరంగంగా మద్దతు పలకడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఉదంతం పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఖర్గే సభ జరిగిన చోట ‘శుద్ధి’.. రాజ్యసభలో రగడ.. నడ్డా ఏమన్నారంటే..!

మొదటిపేజీ తరువాయి – చేయడం రాజకీయ దుమారం రేపింది. ఈ అంశం గురువారం రాజ్యసభను కుదిపేసింది. ఖర్గే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయగా.. కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందించారు. ఈ ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. బీజేపీ ఇలాంటి చర్యలను సమర్థించదని స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో ఆగస్టు 8న ఖర్గే ‘విజయ శంఖనాద’ సభ నిర్వహించారు. రెండు రోజుల తర్వాత శ్రీరామ్ సేనకు చెందిన కార్యకర్తలు అక్కడ హోమం చేసి వేదికను ‘శుద్ధి’ చేసినట్లు వార్తలు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. రాజ్యసభలో ఖర్గే మాట్లాడుతూ.. తన సభకు లక్షలాది మంది హాజరయ్యారని చెప్పారు. తాను ఏ మతం లేదా వర్గం గురించి మాట్లాడలేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనే మాట్లాడానని తెలిపారు. అయినా తన ప్రసంగం తర్వాత వేదికకు శుద్ధి చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్య పద్ధతేనా? రాజ్యాంగాన్ని ఎలా కాపాడుతున్నారని నిలదీశారు. ఈ ఘటనను ఖండించిన రాజ్యసభ ఛైర్మన్.. అంటరానితనం కంటే పెద్ద పాపం మరొకటి లేదని వ్యాఖ్యానించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖర్గే దళితుడు కావడంతోనే శుద్ధి చేశారని ఉత్తరాఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేశ్ గోదియాల్ ఆరోపించారు. దీనికి బీజేపీ రాష్ట్ర నేత ఖజన్ దాస్ స్పందించారు. ఖర్గే సభలో చేసిన కొన్ని నినాదాలు సనాతన వర్గాల మనోభావాలను దెబ్బతీశాయని చెప్పారు. రామ్‌లీలా మైదానం మతపరమైన ప్రాధాన్యం ఉన్న ప్రాంతమని తెలిపారు. శుద్ధి కార్యక్రమంతో బీజేపీకి సంబంధం లేదని నడ్డా స్పష్టం చేశారు. ఘటనపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు.

# ఇవాళ జైలులో నన్ను కూడా అవమానించారు

మొదటిపేజీ తరువాయి – అరెస్టు ఘటనే నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ అన్నారు. కర్నూలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్యే విరూపాక్షిని గురువారం ఆయన ములాఖత్‌లో భాగంగా కలిశారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ‘రెడ్ బుక్’ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాను ఇవాళ జైలుకు వస్తే తనను కూడా అవమానించే ప్రయత్నం చేశారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. “ఒక మాజీ ముఖ్యమంత్రిగా వచ్చిన నన్ను లోపల కూర్చోబెట్టి ఫోటో తీయకుండా, గ్రిల్స్ బయట నిలబెట్టి ఫోటో తీశారు. ఇది చంద్రబాబు శాడిస్టిక్ మనస్తత్వానికి నిదర్శనం. మా హయాంలో పీపుల్ ఫ్రెండ్లీ పోలీస్ స్టేషన్లు తీసుకొస్తే, వీళ్లు అవమానించే సంస్కృతిని తెచ్చారు” అని అన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. “ఈరోజు మీరు ఏ తప్పుడు విత్తనాలు నాటుతున్నారో, అవే రేపు మహావృక్షాలై మిమ్మల్ని రెండింతలుగా చుట్టుకుంటాయి. ఈ కక్ష సాధింపు రాజకీయాలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు” అని జగన్ హెచ్చరించారు. సమయం వేగంగా గడిచిపోతుందని, ఈ దుర్మార్గపు పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడతారని ఆయన వ్యాఖ్యానించారు. “ఈ వెన్నుపోటు పార్టీ పాలనలో బాధితులే నిందితులుగా మారుతున్నారు. దాడికి గురైన వారిపైనే కేసులు పెడుతున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. దీనికి విరూపాక్షి ఉదంతమే ప్రబల ఉదాహరణ” అని జగన్ పేర్కొన్నారు. ఆగస్టు 1న చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో తమ పార్టీ కార్యకర్త గిరి తనపై దాడి జరుగుతోందని, రక్షించమని రాత్రి 7:45 గంటలకు ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేసి, వీడియోలు పంపాడని జగన్ ఆధారాలను చూపుతూ వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్థానిక ఎస్సైకి 7:47 గంటలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా పోలీసులు స్పందించలేదన్నారు. పైగా, కార్యకర్తను కాపాడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపై దాడి చేశారని, ఆయన తమ్ముడి చేయి విరగ్గొట్టారని ఆరోపించారు. దాడికి గురైన విరూపాక్షి ఫిర్యాదును పోలీసులు తీసుకోకపోగా, అర్ధరాత్రి 2:45 గంటలకు వందల మంది పోలీసులు దొంగల్లా ఆయన ఇంటిపై పడి, తలుపులు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, ఒక ఉగ్రవాదిని పట్టుకున్నట్లు అరెస్టు చేశారని జగన్ మండిపడ్డారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు కలిపి మొత్తం 38 మందిపై మూడు వేర్వేరు అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని తెలిపారు. ఒకే వ్యక్తి పేరును ఎఫ్ఐఆర్‌లో రెండుసార్లు చేర్చడం చూస్తే, కేసు ఎంత కట్టుకథో అర్థమవుతోందన్నారు. ఈ ప్రభుత్వం బీసీ, మైనారిటీ వర్గాల నాయకత్వాన్ని అణిచివేసేందుకు కుట్ర చేస్తోందని జగన్ ఆరోపించారు. మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడి బైక్ యాక్సిడెంట్‌ను హత్యాయత్నంగా చిత్రీకరించడం, మాజీ ఎమ్మెల్యే ముస్తఫాపై కిడ్నాప్ కేసు పెట్టడం, కారుమూరు సునీల్‌పై అక్రమ కేసులు బనాయించడం వంటివి ఇందులో భాగమేనని విమర్శించారు.

# సీడ్ యాక్సెస్ రోడ్డు.. నూతన స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించిన చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి – అనుసంధానిస్తూ బకింగ్‌హామ్ కెనాల్‌పై నిర్మించిన నూతన స్టీల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రారంభించారు. ఉండవల్లి వద్ద ప్రత్యేక శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం, అనంతరం స్వయంగా కాలినడకన వెళ్లి స్టీల్ బ్రిడ్జి నిర్మాణాలు, రహదారి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రైతులు, స్థానికులను ఉద్దేశించి ఆయన అత్యంత భావోద్వేగంగా ప్రసంగించారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన అన్నదాతలు చేసింది కేవలం భూత్యాగం మాత్రమే కాదని, రాబోయే తరాలకు, ప్రపంచానికే ఆలోచింపజేసే ఒక గొప్ప స్ఫూర్తినిచ్చారని సీఎం చంద్రబాబు కొనియాడారు. రాజధాని నిర్మాణంలో రైతులను నేరుగా భాగస్వాములను చేయాలనే మహోన్నత ఆలోచనతోనే తాము ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తీసుకొచ్చామని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వంపై ఉంచిన నమ్మకంతో నోటిఫికేషన్ ఇచ్చిన కేవలం 58 రోజుల్లోనే 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 33 వేల ఎకరాల భూమిని ఇచ్చారని, ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి ఉదారత చూడలేమని చెబుతూ అమరావతి రైతాంగానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని వ్యాఖ్యానించారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులను స్మరించుకుంటూ, నాడు మనకు రాజధాని ఎక్కడ నిర్మించాలో, ఎటు వెళ్లాలో తెలియని గందరగోళం నెలకొందని తెలిపారు. శివరామకృష్ణన్ కమిటీ నివేదికలు, మెజారిటీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రానికి నడిబొడ్డున ఉన్న అమరావతిని రాజధానిగా ఎంపిక చేశామని చెప్పారు. నాడు ఏమీ లేని శూన్యం నుంచి నేడు ప్రపంచం గర్వించే రీతిలో స్వయంగా రాజధానిని నిర్మించుకునే స్థాయికి చేరుకున్నామని ఆనందం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధిని ప్రస్తావిస్తూ... నాడు ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్, హైటెక్ సిటీ నిర్మిస్తుంటే చాలామంది హేళనగా మాట్లాడి ఎగతాళి చేశారని సీఎం గుర్తుచేశారు. కానీ నేడు తెలంగాణ తలసరి ఆదాయంలో దేశానికే ఆదర్శంగా నిలిచిందంటే ఒక నాయకుడిగా తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. నాడు చేసిన అభివృద్ధి వల్ల అక్కడ 42 శాతం మంది ప్రజలు బాగుపడ్డారని, మిగిలిన 58 శాతం ఉన్న మన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూడా ఒక సమర్థవంతమైన, ప్రపంచస్థాయి రాజధాని కావాలనే దృఢ సంకల్పంతోనే అమరావతికి శ్రీకారం చుట్టానని స్పష్టం చేశారు. సైబరాబాద్ నిర్మాణం కోసం తాను అమెరికా వెళ్తే, అమరావతి ప్రపంచంలోనే అత్యుత్తమ నగరం కావాలని తొలిసారి సింగపూర్ వెళ్లానని చెప్పారు. ఈ నగరంలో కేబుళ్లు ఏవీ పైన కనిపించవని, పూర్తి పర్యావరణహితంగా ప్రపంచంలోనే నంబర్ వన్ గ్రీన్ సిటీగా అమరావతి నిలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో అమరావతిని కేవలం ‘గ్రాఫిక్స్’ అని విమర్శించిన వారు ఇప్పుడు ప్రత్యక్షంగా వచ్చి చూస్తే ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి ఏంటో కళ్లకు కట్టినట్లు తెలుస్తుందని సూచించారు. ఈ మహోన్నత కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, సీఆర్‌డీఏ అధికారులు, వేలాది మంది అమరావతి రైతులు, స్థానికులు పాల్గొన్నారు. అమరావతిలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం 21.77 కిలోమీటర్ల పొడవైన సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభించిన చంద్రబాబు బకింగ్‌హామ్ కెనాల్‌పై 4 వరుసల స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించిన సీఎం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. అమరావతి రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ఈ-3 సీడ్ యాక్సెస్ రోడ్ రెండో దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. రాజధాని కనెక్టివిటీని బలోపేతం చేసే లక్ష్యంతో మొత్తం రూ.1,519 కోట్ల భారీ వ్యయంతో 21.77 కిలోమీటర్ల పొడవున, 60 మీటర్ల వెడల్పుతో 9 లేన్ల రహదారిగా దీనిని రూపొందిస్తున్నారు. విజయవాడ–మంగళగిరి హైవేను అనుసంధానిస్తూ బకింగ్‌హామ్ కెనాల్‌పై 478 మీటర్ల పొడవునా నూతనంగా నిర్మించిన 4 వరుసల స్టీల్ బ్రిడ్జిని కూడా సీఎం ప్రారంభించారు. ఇది రాజధాని ప్రాంతానికి రాకపోకలను మరింత సులభతరం చేయనుంది. సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమీపంలో అధికారులు, ఉద్యోగుల కోసం నిర్మించిన 9 టవర్లలోని 216 క్వార్టర్ల పనులన్నీ (ఇంటీరియర్స్ సహా) పూర్తయ్యాయి. అధికారులు వీటికి సంబంధించిన తాళాలను సీఎం చంద్రబాబు నాయుడికి అందజేయనున్నారు.

# గతంలో కోర్టుకెళ్లిన మీరే.. ఇప్పుడు అవే భూములను ఎలా వేలం వేస్తారు?

మొదటిపేజీ తరువాయి – ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నేడు ఓ లేఖ రాశారు. ఆగస్టు 17, 21 తేదీల్లో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) నిర్వహించ తలపెట్టిన వేలాన్ని తీవ్రంగా ఖండించారు. గతంలో ప్రభుత్వ భూములను పూర్వీకులు అందించిన జాతీయ సంపదగా అభివర్ణిస్తూ ఉద్వేగభరిత ప్రసంగాలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక అవే భూములను అమ్మకానికి పెట్టారంటూ హరీశ్ రావు వ్యాఖ్యానించారు. గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీ పరిసరాలు, రాయదుర్గం వంటి ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను అమ్మేయడానికి కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పర్యావరణ భూముల నుంచి రాయదుర్గంలోని వారసత్వ రాతి ప్రదేశాల వరకు తెలంగాణ విలువైన ప్రజా ఆస్తులకు ప్రమాదం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. “వేలం వేయాలని ప్రతిపాదించిన రాయదుర్గం పాన్‌మక్తా గ్రామంలోని సర్వే నంబర్ 83ని ఇప్పటికే హెరిటేజ్ సైట్‌గా ప్రకటించారు. దీని యాజమాన్య హక్కులపై ఎస్బీఐ, వక్ఫ్ బోర్డు మధ్య న్యాయవివాదాలు కొనసాగుతున్నాయి. ఇలాంటి కేసులు పరిష్కారం కానప్పుడు థర్డ్ పార్టీ ప్రయోజనాలు కల్పించవద్దని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది” అని హరీశ్ రావు తన లేఖలో గుర్తుచేశారు. ఇదే భూముల పరిరక్షణ కోసం 2020లో రేవంత్ రెడ్డి కోర్టులను ఆశ్రయించారని చెప్పారు. “అప్పుడు కోర్టుకెక్కిన మీరే, ఇప్పుడు సీఎం అయ్యాక వివాదాస్పద ఆస్తిపై థర్డ్ పార్టీ హక్కులు ఎలా కల్పిస్తారు?” అని ప్రశ్నించారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలను ఎకరాకు రూ. 237 కోట్ల చొప్పున వేలం వేయగా, ఆ భూమిపై ఎస్బీఐ యాజమాన్య హక్కులను ప్రకటించిందని, ఈ అంశం ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో విచారణలో ఉందని హరీశ్ రావు తెలిపారు. ఈ కేసు తేలకుండానే, అదే సర్వే నంబర్‌లోని మరో 10.63 ఎకరాలను వేలం వేయడం పరిపాలనా విచక్షణను, ప్రభుత్వ నిబద్ధతను ప్రశ్నిస్తోందని విమర్శించారు. భూమి యాజమాన్య హక్కులు చట్టబద్ధంగా తేలే వరకు ఎలాంటి వేలం, బదిలీ, రిజిస్ట్రేషన్ లేదా అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టవద్దని ఆయన డిమాండ్ చేశారు. వారసత్వ ఆస్తికి సంబంధించిన రికార్డుల గల్లంతుపై విచారణ జరిపించాలని, వక్ఫ్ రికార్డుల మాయంపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. భవిష్యత్ తరాల కోసం ఈ విలువైన భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# 250 రోజులుగా సముద్రంలోనే అమెరికా యుద్ధనౌకలో ఏం జరుగుతోంది?

మొదటిపేజీ తరువాయి – పాల్పడినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. కొందరు నౌక నుంచి సముద్రంలోకి దూకేందుకు ప్రయత్నించగా తోటి సిబ్బంది అడ్డుకున్నట్లు ‘మిలిటరీ టైమ్స్’ కథనం తెలిపింది. సుమారు 5,000 మంది నావికులు, మెరైన్లు ఉన్న ఈ యుద్ధనౌక వరుసగా 250 రోజులుగా తీరానికి చేరలేదు. సుదీర్ఘ మోహరింపు, పదేపదే పొడిగింపులు సిబ్బందిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. శాన్ డియాగోలో నిర్వహించిన సమావేశంలో దాదాపు 200 మంది కుటుంబ సభ్యులు నేవీ ఉన్నతాధికారులను నిలదీశారు. ఓ మహిళ తన భర్త అదే రోజు తనకు సందేశం పంపాడని చెప్పారు. “రేపు నిద్ర లేవకపోతే బాగుంటుందని” అతడు చెప్పినట్లు తెలిపారు. నేవీ నాయకత్వంపై తమ నమ్మకం దెబ్బతిన్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త నౌక నుంచి దూకేందుకు ప్రయత్నించాడని మరో నావికుడి భార్య తెలిపింది. సుదీర్ఘ మోహరింపుతో తీవ్రంగా అలసిపోయిన అతడు భవిష్యత్తుపై భయపడుతున్నట్లు చెప్పారు. మరో ఘటనలో నౌక నుంచి దూకేందుకు ప్రయత్నించిన సహచరుడిని ఓ నావికుడు పట్టుకుని వెనక్కి లాగినట్లు సమాచారం. అబ్రహం లింకన్ గత నవంబర్ 21న శాన్ డియాగో నుంచి బయలుదేరింది. తొలుత పసిఫిక్ ప్రాంతానికి వెళ్లాల్సి ఉండగా ఇరాన్ యుద్ధం నేపథ్యంలో మధ్యప్రాచ్యానికి మళ్లించారు. అప్పటి నుంచి సిబ్బందికి తీరంలో గడిపే అవకాశం చాలా తక్కువగా లభించింది. డిసెంబరులో గువామ్‌లో, జులైలో ఒమన్‌లో కలిపి రెండు రోజులు మాత్రమే నేలపై గడిపినట్లు సమాచారం. మే నెలలో మోహరింపు ముగియాల్సి ఉంది. యుద్ధం కొనసాగడంతో పలుమార్లు పొడిగించారు. ప్రస్తుతం నౌక ఇరాన్‌పై యుద్ధ కార్యకలాపాల్లో పాల్గొంటోంది. సిబ్బంది నివాస పరిస్థితులపైనా తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. బూజు పట్టిన షవర్లు, పనిచేయని మరుగుదొడ్లు, వారాల తరబడి పనిచేయని లాండ్రీ యంత్రాలు, వేడి నీటి కొరత ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సబ్బు, డియోడరెంట్, టూత్‌పేస్ట్ కూడా అందుబాటులో లేని సందర్భాలు ఉన్నాయని ఆరోపించారు. ఆహారం పరిమితంగా ఉంటోందని కూడా ఫిర్యాదులు వచ్చాయి. కాలిఫోర్నియా కాంగ్రెస్ సభ్యుడు మైక్ లెవిన్ ఈ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. సైనికులకు కనీసం వేడి నీరు, పనిచేసే మరుగుదొడ్డి, తగిన ఆహారం అందించాల్సిన బాధ్యత నేవీపై ఉందని అన్నారు.

## ఇమ్రాన్ ఖాన్ చనిపోయారా? పాక్ జర్నలిస్టు సంచలన వ్యాఖ్యలు.. నిజమెంత?



మొదటిపేజీ తరువాయి – అమెరికాలో ఉంటున్న జర్నలిస్ట్ వజాహత్ సయీద్ ఖాన్ ఓ ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇమ్రాన్ ఖాన్ ఇప్పుడు జీవించి లేరని ముగ్గురు సీనియర్ పాకిస్థాన్ సైనిక అధికారులు తనకు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే వాళ్లు కూడా ఈ సమాచారాన్ని స్వయంగా నిర్ధారించలేదని చెప్పారు. అనధికారిక మార్గాల్లో తమకు సమాచారం అందిందని మాత్రమే వారు చెప్పినట్లు వివరించారు. 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్ 2023 నుంచి రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్నారు. ఆయనపై పలు కేసులు కొనసాగుతున్నాయి. జైల్లో ఉన్న ఆయన్ను కలిసేందుకు కుటుంబ సభ్యులకు అనుమతి ఇవ్వడం లేదంటూ పాకిస్థాన్ తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ పలుసార్లు ఆరోపించింది. ఆయనకు సరైన వైద్యం అందడం లేదని కూడా పార్టీ నేతలు చెబుతున్నారు. ఇమ్రాన్ కుటుంబ సభ్యులు, పీటీఐ నేతలు మంగళవారం మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతి ఇవ్వకపోతే సెప్టెంబర్ 27న ఇస్లామాబాద్‌కు లాంగ్ మార్చ్ చేపడతామని పీటీఐ ప్రకటించింది. అంతకుముందే నిరసనలు చేపడతామని హెచ్చరించింది. ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై అమెరికా నుంచి కూడా పాకిస్థాన్‌పై ఒత్తిడి పెరుగుతోంది. 13 మంది అమెరికా చట్టసభ సభ్యులు అక్కడి విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు లేఖ రాశారు. ఇమ్రాన్, ఆయన భార్య బుష్రా బీబీ నిర్బంధ పరిస్థితులపై ఇస్లామాబాద్‌తో మాట్లాడాలని కోరారు.

## సభలో తొలిసారి వందేమాతరం ఆరు చరణాల ఆలాపన.. ముగిసిన వర్షాకాల సమావేశాలు



ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతం ‘జనగణమన’తో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన చేపట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ ఘటనతో చోటు చేసుకున్న తీవ్ర పరిణామాలతో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే.. ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

TG/TEL/25/A3731
# నిజం
దృష్టి తెలుగు న్యూస్
శుక్రవారం 14- 08 - 2026

## ఘనంగా వీసం నరేందర్ జన్మదిన వేడుకలు



**నిజం న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా ఆగస్టు 13:** యాదాద్రి భువనగిరి జిల్లా పంచాయతీ సెక్రటరీల సంఘం అధ్యక్షులు, ఇంద్రపాలనగరం పంచాయతీ కార్యదర్శి వీసం నరేందర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. రామన్నపేట మండల కేంద్రంలోని రహదారి బంగ్లాలో ఆత్మీయులు, స్నేహితుల సమక్షంలో నరేందర్ జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా వీసం నరేందర్ కేక్ కట్ చేసి తన జన్మదిన వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మీయతకు వేదికగా మారిన వేడుకలు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వీసం నరేందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండిన జీవితం గడపాలని ఆకాంక్షించారు. నరేందర్ మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డి స్వామి, నాగటి ఉపేందర్, పెరుమాండ్ల యాదగిరి, అప్పం సురేందర్, బాషమల్ల సంతోష్, కర్నె వినయ్, భూతం శ్రీకాంత్, బాధే అశోక్, బాధే చంద్రశేఖర్, నాగటి నరేష్, తదితరులు పాల్గొని వీసం నరేందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వట్టి ఉపేందర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు:- ఎర్ర యాకన్న, అధ్యక్షులు,టిడబ్ల్యూజేఎఫ్



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 13:** కూకట్పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి కాలనీ రోడ్1 కేపీహెచ్బి కమ్యూనిటీ హాల్ లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వట్టి ఉపేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) కూకట్పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య హాజరై శాలువా, పూల బొకేతో ఘనంగా సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి టిడబ్ల్యూ జేఎఫ్ ప్రధాన కార్యదర్శి అంజిబాబు నాగుల (జనరల్ సెక్రటరీ), కార్యవర్గ సభ్యులు సుజాత, సభ్యులు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్పర్సన్‌బి రాగం సుజాత యాదవ్ కన్నుమూత




**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, ఆగస్టు 13:** ఆమె కేవలం ఒక నాయకురాలు మాత్రమే కాదు. బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన తల్లి. మహిళల ఆత్మగౌరవం కోసం పోరాడిన శక్తి. ప్రతి కార్యకర్తకు స్ఫూర్తినిచ్చిన నాయకురాలు.

అంతిమ సందర్శన వివరాలు:

తేదీ: రేపు అనగా శుక్రవారం

సమయం: ఉదయం 07:00 గంటల నుండి 11:30 వరకు

స్థలం: వర్టెక్స్ కింగ్స్టన్ పార్క్, స్వగృహం

అనంతరం అంత్యక్రియల కార్యక్రమాలు జరుగును.

కావున అభిమానులు, కార్యకర్తలు, నాయకులు సకాలంలో పాల్గొని అమ్మ కి తుది వీడ్కోలు పలకగలరని కోరుతున్నాము.

ఆమె చూపిన బాటలో నడుస్తూ, ఆమె కలను నిజం చేస్తామని ప్రమాణం చేస్తున్నాం.
అమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ...
ఓం శాంతి

## ఘనంగా శ్రీ విశ్వకర్మ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ముఖ్య అతిథిగా తుంగ తుర్తి రవి హాజరు....




**మేడిపల్లి, నిజం న్యూస్ ప్రతినిధి:** శ్రీ విశ్వకర్మ సంఘం మేడి పల్లి నూతన కమిటీ ప్రమా ణ స్వీకార మహోత్సవం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణం లో ఘనంగా జరిగింది. సంఘ అధ్యక్షులు కందోజు వెంక టాచారి, ప్రధాన కార్య దర్శి కూరెళ్ల లక్ష్మీనారాయణచారి సంయుక్త ఆధ్వర్యం లో నిర్వహించిన ఈ కార్యక్ర మానికి మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంగ తుర్తి రవిచారి ముఖ్య అతిథిగా విచ్చేశారు.?ఈ కార్యక్ర మంలో నూతన కార్యవర్గం గా అధ్యక్షులుగా బెజ్జంకి శ్రీనివాసచారి, ప్రధాన కార్య దర్శిగా శ్రీరామోజు వేణుచారి, కోశాధికారిగా మొలు పోజు రాజుచారితో పాటు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేశారు.? ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి హాజరై మాట్లాడుతూ.. సమాజంలో విశ్వకర్మల సేవలు ఎంతో గొప్పవని, అందరూ ఐక్యత తో ఉంటూ సంఘ అభివృద్ధి కి పాటుపడాలని పిలుపు నిచ్చారు. గడిచిన 21 సంవ త్సరాలుగా ఎలాంటి విభేదా లు లేకుండా సంఘాన్ని ఏక తాటిపై నడిపిస్తూ, అభివృద్ధి కి అహర్నిశలు కృషి చేసిన మాజీ అధ్యక్షులు కందోజు వెంకటాచారి, ప్రధాన కార్య దర్శి కూరెళ్ల లక్ష్మీనారాయ ణచారిల సేవలను ఆయన ప్రత్యేకంగాఅభినందించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ కూడా అదే స్ఫూర్తితో సంఘాన్ని మరింత ముందు కు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.?ఈ కార్యక్రమంలో సిరిపురం సర్వేశ్వర్‌చారి, జంగాచారి, రమేష్‌చారి, పబ్బోజు శ్రీనివాస్‌చారి, సోమాచారి, సుత్తోజు కుమారస్వామి, బాలాచారి, శంకరాచారి, రాములుచారి, బాలరాజు చారి, శ్రీనివాస చారి, రామాచారితో పాటు భారీ సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## 'ఫోనే నరకం చూపించింది'.. కదలలేని స్థితిలో నటి షకీలా.. రూ. 3 లక్షలతో మెడకు ఆపరేషన్!



**నిజం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 13:** గంటల తరబడి స్మార్ట్‌ఫోన్‌కు అతుక్కుపోవడం ఎంత ప్రమాదకరమో చెప్పడానికి సీనియర్ నటి షకీలా ఉదంతం ఒక హెచ్చరికగా నిలుస్తోంది. ఫోన్ వ్యసనం కారణంగా తీవ్రమైన నరాల సమస్య బారిన పడిన ఆమె, ఇటీవల మెడకు అత్యవసర శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ చేదు అనుభవాన్ని ఆమె స్వయంగా వెల్లడిస్తూ, స్మార్ట్‌ఫోన్ వినియోగదారులను అప్రమత్తం చేశారు. గత కొంతకాలంగా తాను మంచంపై తప్పుడు భంగిమలో పడుకుని గంటల తరబడి ఫోన్‌లో రీల్స్ చూడటం, గేమ్స్ ఆడటమే అలవాటుగా మార్చుకున్నానని షకీలా తెలిపారు. కేవలం టీ, కాఫీ తాగేందుకు మాత్రమే విరామం తీసుకుని, మిగతా సమయమంతా ఫోన్‌తోనే గడిపానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దురలవాటు కారణంగా మెడలోని ప్రధాన నరాలపై తీవ్ర ఒత్తిడి పడి, సమస్య జఠిలమైందని వివరించారు. చివరికి ఈ అలవాటే తనను ఆపరేషన్ టేబుల్ వరకు తీసుకెళ్లిందని ఆమె వాపోయారు.

## సీతారామ కాలనీలో విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం

### స్థానికుల సమస్యపై వెంటనే స్పందించిన ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)



**నిజం న్యూస్ ప్రతినిధి,ఉప్పల్, ఆగస్టు 13 : ఉప్పల్:** బీరప్పగడ్డ డివిజన్‌లోని సీతారామ కాలనీలో ఇళ్లకు అత్యంత సమీపంగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు, స్తంభం సమస్యకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) చొరవతో పరిష్కారం లభించింది. సీతారామ కాలనీ వాసులు విద్యుత్ వైర్లు ఇళ్లకు అతి దగ్గరగా ఉండటంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించి సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి వారి సహకారం, మార్గదర్శకత్వంతో విద్యుత్ శాఖ నుంచి అవసరమైన అనుమతులు, మంజూరీలు తీసుకుని సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఇళ్లకు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్‌ను తొలగించి, స్తంభానికి కొత్త యాంగిల్ ఏర్పాటు చేయడంతో పాటు కేబుల్ ద్వారా విద్యుత్ లైన్‌ను సురక్షితంగా మార్చారు. దీంతో స్థానికులు చాలా కాలంగా ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు భవిష్యత్తులో ప్రమాదాల ముప్పు కూడా తగ్గింది. ఈ సందర్భంగా సీతారామ కాలనీ ప్రెసిడెంట్ గూడూరు రమేష్ గౌడ్‌లితో పాటు కాలనీ వాసులు లిఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)లిను అభినందించి, సమస్యను వెంటనే పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) మాట్లాడుతూ, "ప్రజలు తమ సమస్యను నా దృష్టికి తీసుకువచ్చిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపించడం నా బాధ్యత. ప్రజల భద్రత, సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను" అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా ప్రజల మధ్య పనిచేస్తోందని, స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే వరకు నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతారామ కాలనీ ప్రెసిడెంట్ గూడూరు రమేష్ గౌడ్‌తో పాటు పలువురు కాలనీ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం

### సామాజిక సేవలో భాగంగా సామాన్య ప్రజలకు ఉచిత వైద్య సేవలు - గోగులపాటి కృష్ణమోహన్





**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్, ఆగస్టు 13:** మేడ్చల్ జిల్లా, సుభాష్ నగర్ డివిజన్, సూరారం కాలనీలోని లూయిస్ బ్రెయిలీ భవన్‌లో నా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ జన్మదినం సందర్భంగా సీఎమ్మార్ హాస్పిటల్, కండ్లకోయ వారి సౌజన్యంతో నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు, నా ఫౌండేషన్ మరియు నా టీవీ వ్యవస్థాపకులు లిగోగులపాటి కృష్ణమోహన్‌లి మాట్లాడుతూ, "సాహిత్యస్య వికాసాయ, రక్షణాయ చ సంస్కృతేః। సామాజిక హితార్థాయ, నా సంస్థా వర్తతే చిరం" అనే ధ్యేయంతో సాహిత్య వికాసం, సామాజిక శ్రేయస్సు, సాంస్కృతిక పరిరక్షణ లక్ష్యాలుగా నా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాజిక సేవ, సాహిత్య వికాసం, సాంస్కృతిక పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూడా నా ఫౌండేషన్ తన వంతు కృషి చేస్తుందని నిర్వాహకులు తెలిపారు. సామాన్య ప్రజలకు సైతం నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో, కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందించేందుకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు కృష్ణమోహన్ తెలిపారు. శిబిరంలో సుమారు 100 మంది వరకు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యుల సూచనల మేరకు 25 మందికి రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు, వైద్య సేవలు పొందిన వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసబుల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజయ్య, సీఎమ్మార్ హాస్పిటల్ పీఆర్వో దుర్గాప్రసాద్, గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన సలహాదారు రమేష్ సర్వేపల్లి, సంఘం సభ్యులు గడ్డం రాంబాబు, శ్రీధరాచార్యులు, నరేందర్ రెడ్డి, యాదయ్య, రాము, శేఖర్ గౌడ్, సీఎమ్మార్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ప్రవల్లిక, కోఆర్డినేటర్ రాజ్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్పల్లి అభివృద్ధికి అన్ని అధికారాలు ఉన్నాయి అడిగి చేయించుకోండి: సీఎం రేవంత్ రెడ్డి



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 13:** ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనాడు నేను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్ పల్లి ప్రజలు నన్ను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారన్నారు ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానని గుర్తు చేసుకున్నారు కానీ ఇప్పుడు కూకట్ పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉంది మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి అని సలహా ఇచ్చారు కూకట్ పల్లి నియోజకవర్గాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేయాలని శ్రీధర్ బాబును ఆదేశించారు పదేళ్ల వారి పరిపాలన రెండేళ్ల మా పాలనను బేరీజు వేసుకోవాలన్నారు తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని, ప్రతీ పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వడమే కాకుండా, రూ.500 లకే గ్యాస్ సిలిండర్ కూడా అందిస్తున్నామన్నారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించి, ఆర్టీసీలో ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం అన్నారు. స్వయం సహాయక సంఘాలకు రూ.65 వేల కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు అందించాం అన్నారు ఆడ బిడ్డలను బస్సులకు యజమానులను చేశామని అంతే కాకుండా పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించి ఆర్థిక చేయూత అందించామన్నారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో స్టాళ్లను ఏర్పాటు చేయించామన్నారు ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నార పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కు శ్రీకారం చుట్టిందన్నారు మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటానన్నారు 22 ఏ విషయంలో మీ సొంత భూములు కోల్పోకుండా చూసే బాధ్యత మాది ఈ విషయంలో మీకు ఆందోళన అవసరం లేదు. పదేళ్ల వారి పాలను.. రెండేళ్ల మీ తమ్ముడి పాలనను బేరీజు వేసుకోండి నాకు వయసు ఉంది... ఓపిక ఉంది.. మీకు మంచి చేయాలన్న సంకల్పం ఉంది తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం కొంతమంది దుర్మార్గులు రాష్ట్రంలో కరువు రావాలని క్షుద్ర పూజలు చేశారు అయినా దేవుడు మన వైపు ఉన్నాడు.. వర్షాలు కురిపించాడు మంచి మనసుతో అభివృద్ధి చేయాలన్న మా సంకల్పానికి దేవుడి ఆశీర్వాదం ఉంది కుటిల బుద్ధితో క్షుద్ర పూజలు చేసే వారికి అది తిరిగి వారినే అష్ట దిగ్బంధనం చేస్తుంది మీరు అండగా ఉండండి.. అభివృద్ధి చేసి చూపిస్తా.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనతో కూకట్‌పల్లిలో అభివృద్ధికి కొత్త శకం : బండి రమేష్





**నిజం న్యూస్ కూకట్‌పల్లి ప్రతినిధి, ఆగస్టు 13:** ఇందిరమ్మ టవర్స్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కె.పి.హెచ్.బి ప్రజయ్ అపార్ట్మెంట్స్ రోడ్, గోకుల్ ప్లాట్స్ వద్ద ఇందిరమ్మ టవర్స్ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్, మేడ్చల్ మల్కాజ్గిరి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్,టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, పేదలు, మధ్యతరగతి ప్రజలకు సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. హైదరాబాద్ నగరంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన జీవన ప్రమాణాలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో గృహ నిర్మాణ రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఇందిరమ్మ టవర్స్ వంటి నిర్మాణాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన నివాస సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. బండి రమేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు. ఇందిరమ్మ టవర్స్ శంకుస్థాపన కూకట్‌పల్లి ప్రజలకు ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు. పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన గృహ వసతి కల్పించడంతో పాటు నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న సహకారానికి బండి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కూకట్‌పల్లిని మరింత అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు,డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆయుష్ వైద్యులకు తెలుగుదేశం పార్టీ నాయకుల మద్దతు





**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 13:** తెలంగాణ రాష్ట్రం లో సేవలందిస్తున్న ఆయుష్ వైద్యులు / శస్త్ర వైద్యులు తమ గౌరవ వేతనం నిబంధనల ప్రకారం పెంచాలని ఇందిరాపార్క్ , ధర్నాచౌక్ వద్ద చేస్తున్న నిరసన కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం ప్రకటించడం జరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అల్లోపతీ మరియు ఆయుష్ వైద్యులకు / శస్త్ర వైద్యులకు ఒకే విధంగా గౌరవ వేతనం ఉండేదని, కానీ పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో పాలకులు అన్యాయం చేస్తూ... పక్షపాతం వహిస్తున్నారని ఆయుష్ వైద్యులు తమ నిర్వేదాన్ని వెలిబుచ్చారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, (చీ×పీూ) తెలంగాణ రాష్ట్ర సలహాదారు ప్రో. తిరునగరి జ్యోత్స్న యువ వైద్యులకు మద్దతుగా 10వ రోజైన నేడు ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టి ఆయుష్ వైద్యులకు న్యాయం జరిగేవరకు అండగా ఉంటామని నిరసన లో పాల్గొన్న వందలాదిమంది యువ వైద్యులకు భరోసా ఇచ్చి సంఘీభావం తెలిపారు. మరోప్రక్క విభజిత ఆంధ్రప్రదేశ్ లో నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని తెలుగుదేశం ప్రభుత్వం ఆర్థిక లోటులో ఉన్నా, అల్లోపతీ, ఆయుష్ వైద్యులకు / శస్త్ర వైద్యులకు ఒకే విధంగా గౌరవ వేతనం(సుమారు రూ. 70వేలు) ఇస్తున్నారని, ఇక్కడ మన ధనిక తెలంగాణ లో మాత్రం గత బిఆర్ఎస్ పాలనలో మరియు నేటి కాంగ్రెస్ పాలనలోనూ సగానికి సగం మాత్రమే ఇస్తున్నారని, ఇది ఏమాత్రం సమంజసం కాదు కాబట్టి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణం స్పందించి యువ ఆయుష్ వైద్యులకు న్యాయం చేయాలని తెలుగుదేశం పార్టీ తరుపున రాష్ట్ర నాయకుడు వేజండ్ల కిషోర్ బాబు విజ్ఞప్తి చేయడం జరిగింది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర సలహాదారు ప్రో. తిరునగరి జ్యోత్స్న ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తరపున మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టిజికే మూర్తి, తెలుగు యువత నాయకుడు సాయి నాగార్జున, టిఎన్ఎస్ఎఫ్ నాయకుడు రామోజు శివకుమార్, పలువురు తెలుగుదేశం అభిమానులతో కలిసి వేజండ్ల కిషోర్ బాబు పాల్గొనడం జరిగింది.

## బాప్‌రే.. పరగడుపునే బెల్లం తింటే ఇన్ని లాభాలా..? అస్సలు ఊహించలేరు..



ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో కొద్దిగా బెల్లం తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఖాళీ కడుపుతో కాస్త బెల్లం తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిదని చెప్తున్నారు నిపుణులు. జీర్ణ సమస్యలు దూరమవుతాయి. శరీరంలోని టాక్సిన్లు బయటకు వెళ్లడంలో హెల్ప్ చేస్తుంది. దీనిలోని ఐరన్, జింక్, సెలెనియం వంటి మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వీటిలోని పోషకాలు అనేక సమస్యలను దూరం చేస్తాయి. అవేంటో తెలుసుకుందాం. ఉదయాన్నే బెల్లం తినటం వల్ల మలబద్ధకం సమస్యతో ఇబ్బంది పడేవారు గోరువెచ్చని నీటితో బెల్లం తీసుకుంటే మంచిది. ఇది లివర్?ని డీటాక్స్ చేసి.. కాలేయంలోని ఫ్లష్?ని, టాక్సిన్లను బయటకు పంపేస్తుంది. ఖాళీ కడుపుతో బెల్లం తీసుకోవటం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ లెవెల్స్?ని పెంచి.. ఎనిమియా సమస్యల నుంచి దూరం చేస్తుంది. సహజమైన కార్బ్స్ శరీరానికి అందుతాయి. ఇవి శరీరానికి మంచి ఎనర్జీని అందిస్తాయి. దంతాల ఆరోగ్యాన్ని కాపాడటంలో బెల్లం సహాయపడుతుంది. దీనిలోని కాల్షియం దంతక్షయం ఏర్పడకుండా రక్షిస్తుంది. చిగుళ్లను బలంగా మారుస్తుంది. బెల్లంలో పోషకాలు మెండుగా ఉంటాయి. ఇవి మలబద్ధకం, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి జీర్ణ సంబంధ సమస్యలు ఏర్పడుకుండా కాపాడుతాయి. కొంతమందికి ఉదయం లేవగానే వాంతులు, వికారం వంటి సమస్యలు ఏర్పడుతుంటాయి. వీటి నుంచి బయటపడేందుకు బెల్లం తినడం మంచిది. ఉదయాన్నే 5 నుంచి 10 గ్రాముల బెల్లం తీసుకోవచ్చు. రెగ్యులర్?గా తీసుకుంటే మంచి ఫలితాలుంటాయి. ఎక్కువ బెల్లం తింటే రక్తంలో షుగర్ లెవెల్స్ పెరుగుతాయి. కడుపు ఉబ్బరం కూడా అవుతుంది. చలికాలంలో లేదా చల్లగా ఉన్న సమయాల్లో బెల్లం తింటే మంచి ప్రయోజనాలు పొందవచ్చు. నడుము, పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోయి బాధపడేవారు ఉదయం కొద్దిగా బెల్లం తినడం అలవాటు చేసుకోండి. ఇది బెల్లీ ఫ్యాట్ కరిగించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. కొందరు ఉదయం లేవగానే తలనొప్పితో బాధపడుతుంటారు. ఇలాంటి వారు రోజూ బెల్లం తినడం వల్ల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. జుట్టు రాలడం సమస్య ఎక్కువగా ఉన్నవారు ఉదయం పూట బెల్లం తినడం అలవాటు చేసుకోండి. దీనిలోని పోషకాలు జుట్టును ఒత్తుగా పెరిగేలా చేస్తాయి. బెల్లంలో ఐరన్, కాల్షియం వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. ఇవి ఎముకలను బలంగా ఉంచడంలో సహాయపడతాయి. ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. బెల్లంలోని పోషకాలు చర్మంపై ముడతలు, మచ్చలు ఏర్పడకుండా కాపాడుతుంది. తద్వారా వయసు పెరిగినా యవ్వనంగా కనిపిస్తారు.

## కూకట్‌పల్లి కేపీహెచ్‌బీలో ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన -- ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రి కి వినతి పత్రం అందజేసిన తూము వేణు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి ఆగస్టు 13:** గురువారం కూకట్‌పల్లి కేపీహెచ్‌బీలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమం అనంతరం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ అధ్యక్షులు తూము వేణు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి మూసాపేట, కూకట్‌పల్లి ప్రాంతాల్లోని పలు కీలక ప్రజా సమస్యలను వివరించారు. ముఖ్యంగా రంగధాముని చెరువు వెనుక ప్రభుత్వం గుర్తించిన సుమారు 45 ఎకరాల భూమి మాత్రమే కాదని, వాస్తవానికి అక్కడ దాదాపు 150 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని సంబంధిత ఆధారాలు, పత్రాలతో సహా తూము వేణు ముఖ్యమంత్రి కి వివరించారు. ఈ విస్తారమైన ప్రభుత్వ భూమిని ప్రజా అవసరాలు, పర్యావరణ పరిరక్షణ, ప్రాంత అభివృద్ధికి ఉపయోగపడేలా ప్రభుత్వం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మూసాపేట చౌరస్తా నుంచి ఆంజనేయ నగర్ చౌరస్తా వరకు 100 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ రహదారి విస్తరణతో ట్రాఫిక్ సమస్యలు తగ్గి, ప్రజల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. అదేవిధంగా మూసాపేట గ్రామంలోని హెచ్‌పీ రోడ్ భూములకు సంబంధించిన 22-ఏ సమస్యను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 22-ఏ పరిధిలో ఉన్న భూముల విషయంలో అర్హత కలిగిన, చట్టబద్ధమైన హక్కుదారులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో పరిశీలన చేయించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కూకట్‌పల్లి, మూసాపేట ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని తూము వేణు ముఖ్యమంత్రి ని కోరారు.

## హై కోర్టు ఆదేశాలతో పార్కును కాపాడిన హైడ్రా

### చందానగర్ అర్జున్‌రెడ్డికాలనీ నివాసితుల హర్షం

**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, ఆగస్టు 13:** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం చందానగర్‌లోని అర్జున్ రెడ్డి కాలనీలో పార్కును హైడ్రా గురువారం కాపాడింది. చందానగర్ సర్వే నంబరు 123లో 3.24 ఎకరాల పరిధిలో 41 ప్లాట్లతో 1995లో హుడా అనుమతి పొందిన లే ఔట్ వేయగా.. ఇందులో 400ల గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. ఈ పార్కును కబ్జా చేసే ప్రయత్నాలను ఎప్పటికప్పుడు అక్కడి నివాసితులు అడ్డుకున్నారు. పార్కు స్థలం తమదిగా చెబుతూ ఆక్రమించేందుకు ప్రయత్నించిన వారిపై అర్జున్‌రెడ్డి కాలనీవాసులు గతంలో హై కోర్టును కూడా ఆశ్రయించారు. పార్కు స్థలంతో పాటు.. అంతర్గత రహదారులను కాపాడాలని జీహెచ్ ఎంసీకి సూచిస్తూ 2022లో హైకోర్టు తీర్పునిచ్చింది. అయితే చుట్టూ ప్రహరీ నిర్మించడంలో జాప్యం జరగగా.. ఆక్రమణదారులు పలుమార్లు జేసీబీలతో చదును చేయడం.. స్థానికులు అడ్డుకోవడం జరుగుతూ వచ్చింది. ఈ విషయాలన్నిటినీ పొందుపరుస్తూ హైడ్రా ప్రజావాణిలో అర్జున్‌రెడ్డి కాలనీవాసులు ఫిర్యాదు చేయగా.. గురువారం పార్కుస్థలం చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది. దీంతో కాలనీ నివాసితులు హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా తాము చేసిన పోరాటానికి హైడ్రాతో శుభం కార్డు పడిందని.. పార్కును కాపాడుకున్నామని కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## ట్రైన్ టికెట్ ధరకే ఫ్లైట్ జర్నీ.. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ బంపర్ ఆఫర్



ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఫ్లాష్ సేల్‌లో కేవలం రూ. 1300కే విమాన టికెట్లను అందిస్తోంది, దీంతో పాటు ఎలాంటి కన్వీనియెన్స్ ఫీజు లేకుండా ప్రయాణికులకు అవకాశం కల్పిస్తోంది. ఈ ప్రత్యేక ఆఫర్ కేవలం ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ అధికారిక వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా బుకింగ్ చేసే వారికి మాత్రమే వర్తిస్తుంది. ఈ సీమిత కాల ఆఫర్ కింద టికెట్ బుకింగ్ ఇప్పటికే మొదలైంది, మే 18 వరకు ఈ అవకాశం అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది. తక్కువ ధరలో విమాన ప్రయాణం చేసే ఈ అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు ప్రయాణికులు ఉత్సాహంగా టికెట్లు బుక్ చేస్తున్నారు. విమాన ప్రయాణికులకు శుభవార్త. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులను ఆకర్షించేందుకు ప్రత్యేక తగ్గింపు ధరలను ప్రకటించింది. కేవలం రూ. 1300 ప్రారంభ ధరతో టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయని సంస్థ తెలిపింది. ఈ 'ఫ్లాష్ సేల్' ద్వారా పరిమిత కాలానికి మాత్రమే తక్కువ ధరలో ప్రయాణించే అవకాశం లభిస్తుంది. ప్రముఖ విమానయాన సంస్థ అయిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తన వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తెచ్చింది. వివిధ గమ్యస్థానాలకు వెళ్లే విమాన టిక్కెట్లపై భారీ తగ్గింపును అందిస్తోంది. ఈ సేల్‌లో టిక్కెట్ల ధరలు కేవలం రూ. 1300 నుండి ప్రారంభమవుతుండటంతో, విమాన ప్రయాణం చేయాలనుకునే వారికి ఇది ఒక గొప్ప అవకాశం ఈ ప్రత్యేక ఆఫర్ పరిమిత కాలం వరకే అందుబాటులో ఉంటుందని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ స్పష్టం చేసింది. ప్రయాణికులు త్వరగా స్పందించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. ఈ తగ్గింపు ధరలు ఎప్పటి వరకు అందుబాటులో ఉంటాయనే దానిపై సంస్థ త్వరలో మరిన్ని వివరాలు వెల్లడించనుంది. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తీసుకువచ్చిన ఈ ఆకర్షణీయమైన ఆఫర్, సామాన్యులకు కూడా విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. తక్కువ ధరల కారణంగా ఎక్కువ మంది ప్రయాణికులు విమాన ప్రయాణం వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. కాబట్టి, మీరు కూడా తక్కువ ఖర్చుతో విమానంలో ప్రయాణించాలని భావిస్తున్నట్లయితే, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ యొక్క ఈ ప్రత్యేక ఆఫర్‌ను పరిశీలించడం మంచిది. మరిన్ని వివరాలు మరియు టిక్కెట్ల బుకింగ్ కోసం ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి.

## చర్మం పొడి బారి ఇబ్బంది పెడుతోందా.. ఇంట్లోని వస్తువులతో ఈ చిట్కాలు ట్రై చేసి చూడండి..





కొంతమంది చర్మం పొడిగా ఉంటుంది. ఇటువంటి చర్మం గలవారు చర్మ సంరక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చిన్న వయసులోనే ముడతలు వచ్చే అవకాశం ఉంది. కనుక చర్మంలో తేమను కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఈ రోజు పొడి చర్మానికి జీవం పోసే 6 సహజ పదార్ధాల గురించి తెలుసుకుందాం.. అవి చర్మాన్ని వెన్నలా మృదువుగా చేస్తాయి. పొడి చర్మం చాలా సాధారణ సమస్య. ఇటువంటి చర్మం కలవారు ఏ సీజన్ లోనైనా జాగ్రత్తగా ఉండాలి. వేసవిలో కూడా వీరు చర్మం పట్ల ఎక్కువ శ్రద్ధ వహించాలి. ఇటువంటి చర్మం ఉన్నవారు ముఖం నుంచి చేతులు కాళ్ళ వరకు ముడతలతో కనిపిస్తుంది. చర్మంలో తేమ లేనప్పుడు.. చర్మం చాలా బిగుతుగా ముడతలతో నిండి పోతుంది. అందువల్ల, సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే.. అకాల వృద్ధాప్యం కూడా సంభవించవచ్చు. పొడి చర్మానికి తగిన విధంగా పోషణ తీసుకోవడం చాలా ముఖ్యం. దీనితో పాటు హైడ్రేషన్ గా ఉంచుకోవడానికి పుష్కలంగా నీరు త్రాగడం, ఆరోగ్యకరమైన పానీయాలు తీసుకోవడం, నీరు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ప్రస్తుతం పొడి చర్మంలో తేమను నిర్వహించడానికి, చర్మాన్ని పోషించడానికి పనిచేసే కొన్ని పదార్ధాల గురించి ఈ రోజు తెలుసుకుందాం.. ఎవరైనా పొడి చర్మంతో ఇబ్బంది పడుతుంటే.. కఠినమైన సబ్బు ఉపయోగించరాదు. వేడి నీటితో స్నానం చేయరాదు. ఇలా చేయడం వలన చర్మం మరింత పొడిగా మారుతుంది. పొడి చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోకపోతే చాలా సార్లు చర్మంపై గీతలు ,పగుళ్లు వంటి సమస్యలు కూడా వస్తాయి. పొడి చర్మాన్ని మృదువుగా మార్చే అద్భుతమైన పదార్ధాల గురించి ఈ రోజు తెలుసుకుందాం.. కలబంద: కలబంద చర్మంపై అద్భుతమైన ప్రభావాలను చూపుతుంది. ఇది చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. పొడి చర్మం ఉన్న వారు అలోవెరా జెల్‌లో విటమిన్ ఇ క్యాప్సూల్స్ కలిపి ప్రతిరోజూ అప్లై చేయండి. ఇది మచ్చలను తగ్గించడంలో కూడా ప్రభావవంతంగా ఉంటుంది.

**శని జయంతి రోజున చేయాల్సిన పనులు చేయకూడని పనులు ఏమిటంటే**

బాదం నూనె: బాదం నూనె కూడా చర్మానికి చాలా మంచిది. పొడి చర్మం ఉంటే, ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు బాదం నూనెను రాయండి. ఇందులో విటమిన్ ఇ కూడా ఉంది. ఇది చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది చర్మ ఛాయను మెరుగుపరుస్తుంది. నిస్తేజంగా ఉన్న చర్మానికి కొత్త జీవాన్ని తెస్తుంది. ఈ స్క్రబ్ ని అప్లై చేయండి: పొడి చర్మం కారణంగా, మృతకణాలు పేరుకుపోతాయి. వీటిని స్క్రబ్బింగ్ ద్వారా తొలగించాల్సి ఉంటుంది. చర్మంలో తేమను కాపాడుకోవడానికి, రంధ్రాలను లోతుగా శుభ్రపరిచే బాదం స్క్రబ్‌ను తయారు చేసుకోవచ్చు. దీని కోసం, బాదం పొడి, తేనె, పెరుగు, లవంగాల పొడి కలపండి. ఈ మిశ్రమంతో చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేయండి. దేశీ నెయ్యి: చర్మానికి పోషణ ఇవ్వడానికి దేశీ నెయ్యిని ఉపయోగించవచ్చు. ఇది చర్మాన్ని లోతుగా తేమగా ఉంచుతుంది. ఇది సరళంగా చేస్తుంది. తద్వారా ముడతలు, సన్నని గీతలు వచ్చే అవకాశాలను తగ్గిస్తుంది. కొబ్బరి నూనె: చర్మం పొడిగా ఉంటే ముఖం, మెడ, చేతులు, కాళ్ళను వారానికి కనీసం మూడు సార్లు కొబ్బరి నూనెతో మసాజ్ చేయండి. ఇది చర్మాన్ని లోతుగా పోషించి మృదువుగా చేస్తుంది. కొబ్బరి నూనె అనేక ఇతర చర్మ సమస్యలను తొలగించడంలో కూడా ప్రభావవంతంగా ఉంటుంది. ఏ ఫేస్ ప్యాక్ అప్లై చేయాలంటే.. చర్మం పొడిగా ఉంటే పెరుగు, తేనె, చిటికెడు పసుపు, గంధపు పొడి, రోజ్ వాటర్, కలబంద జెల్, గ్లిజరిన్ కలిపి ఫేస్ ప్యాక్ తయారు చేసుకోండి. ఈ ప్యాక్‌ను ముఖంపై 20 నిమిషాలు అప్లై చేసి తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి రెండుసార్లు చేయడం వలన చర్మానికి మేలు చేస్తుంది. ఇది మీ చర్మాన్ని మృదువుగా చేయడమే కాదు మీ రంగును మెరుగుపరుస్తుంది. సహజమైన మెరుపును తెస్తుంది. ఈ ప్యాక్ టానింగ్ తొలగించడంలో కూడా సహాయపడుతుంది.

## భారత్ పాక్ దేశాల బోర్డర్‌లో ఉన్న ఈ గ్రామం భూలోక స్వర్గం.. రెండు గ్రామాలను కలిపే నది







భారతదేశంలో చూడదగ్గ అందాలతో అలరించే ప్రదేశాలు చాలా ఉన్నాయి. ఈ ప్రదేశాలు మీకు ఒక కలల ప్రపంచంలా అనిపిస్తాయి. మీరు కూడా ఈ వేసవిలో హిల్ స్టేషన్‌కి వెళ్లాలని ప్లాన్ చేస్తుంటే.. ఈ రోజు మేము ఒక భూతల స్వర్గపు ప్రదేశం గురించి కనుగొన్నాము. ఈ ప్రదేశం చాలా అందంగా ఉంటుంది. ఒక్కసారి ఇక్కడకు వెళ్తే.. తిరిగి రావాలని మీకు అనిపించదు. ఆ హిల్ స్టేషన్ భారతదేశం.. పాకిస్తాన్ మధ్య ఉన్న అందమైన గ్రామం భూతల స్వర్గం అని చెప్పవచ్చు. వేసవి సెలవులు మొదలయ్యాయి. పిల్లలను అందమైన ప్రదేశాలకు తీసుకుని వెళ్ళడానికి తల్లిదండ్రులు ఆసక్తిని చూపిస్తారు. అటువంటి పరిస్థితిలో వేసవి సెలవుల్లో చల్లని ప్రదేశానికి వెళ్లాలని ప్లాన్ చేసుకునేవారు మనాలి, సిమ్లా, ముస్సోరీ లేదా నైనిటాల్ వంటి ప్రదేశాలను సందర్శించాలని ఆలోచిస్తూ ఉంటారు. అయితే ఈ ప్రదేశాలు ఇప్పటికె రద్దీగా మారాయి. కనుక ఈ రోజు అందమైన .. తక్కువ రద్దీ ఉన్న స్థలం గురించి తెలుసుకుందాం. అంతే కాదు ఈ ప్రదేశం ఏదైనా విదేశీ హిల్ స్టేషన్ అనిపిస్తుంది. వేసవి సెలవులు మొదలయ్యాయి. పిల్లలను అందమైన ప్రదేశాలకు తీసుకుని వెళ్ళడానికి తల్లిదండ్రులు ఆసక్తిని చూపిస్తారు. అటువంటి పరిస్థితిలో వేసవి సెలవుల్లో చల్లని ప్రదేశానికి వెళ్లాలని ప్లాన్ చేసుకునేవారు మనాలి, సిమ్లా, ముస్సోరీ లేదా నైనిటాల్ వంటి ప్రదేశాలను సందర్శించాలని ఆలోచిస్తూ ఉంటారు. అయితే ఈ ప్రదేశాలు ఇప్పటికె రద్దీగా మారాయి. కనుక ఈ రోజు అందమైన .. తక్కువ రద్దీ ఉన్న స్థలం గురించి తెలుసుకుందాం. అంతే కాదు ఈ ప్రదేశం ఏదైనా విదేశీ హిల్ స్టేషన్ అనిపిస్తుంది.

1 / 8

ఈ హిల్ స్టేషన్ భారతదేశం, పాకిస్తాన్ మధ్య ఉన్న కరణ్ లోయ. ఇది జమ్మూ కాశ్మీర్‌లో భారతదేశం.. పాకిస్తాన్ మధ్య నియంత్రణ రేఖకు చాలా దగ్గరగా ఉన్న చాలా అందమైన, ప్రశాంతమైన గ్రామం. కనుక ఈ రోజు ఆ అందమైన హిల్ స్టేషన్ గురించి.. ఇక్కడికి ఎలా చేరుకోవచ్చు, ఏమి చూడవచ్చు? ఇది ఎందుకు అంత ప్రత్యేకమైనది అనే విషయాల గురించి తెలుసుకుందాం?

ఈ హిల్ స్టేషన్ భారతదేశం, పాకిస్తాన్ మధ్య ఉన్న కరణ్ లోయ. ఇది జమ్మూ కాశ్మీర్‌లో భారతదేశం.. పాకిస్తాన్ మధ్య నియంత్రణ రేఖకు చాలా దగ్గరగా ఉన్న చాలా అందమైన, ప్రశాంతమైన గ్రామం. కనుక ఈ రోజు ఆ అందమైన హిల్ స్టేషన్ గురించి.. ఇక్కడికి ఎలా చేరుకోవచ్చు, ఏమి చూడవచ్చు? ఇది ఎందుకు అంత ప్రత్యేకమైనది అనే విషయాల గురించి తెలుసుకుందాం?

2 / 8

జమ్మూ కాశ్మీర్‌లోని కుపర్వారాలో ఉన్న ఈ గ్రామం ఇటీవల పర్యాటక రంగం కోసం తెరవబడింది. ఇక్కడకు వచ్చిన పర్యాటకులు అందమైన ప్రకృతిని ఎంజాయ్ చేస్తున్నారు. ఈ కరణ్ గ్రామం గురించి మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఈ గ్రామానికి ఒక వైపు భారతదేశం, మరోవైపు పాకిస్తాన్ ఉన్నాయి. రెండు వైపులా ఒకే నది ప్రవహిస్తుంది. కొన్ని సంవత్సరాల క్రితం వరకు.. రెండు వైపులా ఉన్న ప్రజలు ఒకరినొకరు చూసుకునేవారు. కొంచెం కొంచెం సంభాషణ కూడా చేసుకునేవారు జమ్మూ కాశ్మీర్‌లోని కుపర్వారాలో ఉన్న ఈ గ్రామం ఇటీవల పర్యాటక రంగం కోసం తెరవబడింది. ఇక్కడకు వచ్చిన పర్యాటకులు అందమైన ప్రకృతిని ఎంజాయ్ చేస్తున్నారు. ఈ కరణ్ గ్రామం గురించి మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఈ గ్రామానికి ఒక వైపు భారతదేశం, మరోవైపు పాకిస్తాన్ ఉన్నాయి. రెండు వైపులా ఒకే నది ప్రవహిస్తుంది. కొన్ని సంవత్సరాల క్రితం వరకు.. రెండు వైపులా ఉన్న ప్రజలు ఒకరినొకరు చూసుకునేవారు. కొంచెం కొంచెం సంభాషణ కూడా చేసుకునేవారు



3 / 8

భద్రతా కారణాల దృష్ట్యా ఇప్పుడు ఈ గ్రామాల మధ్య కొన్ని పరిమితమైన కండిషన్స్ అమలులో ఉన్నాయి. అయితే స్థానిక ప్రజలు ఇప్పటికీ ఆ పాత సోదరభావాన్ని గుర్తుంచుకుంటారు. కరోన్ లోయ అందాలకు కూడా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రదేశం సహజ సౌందర్యం చాలా అద్భుతంగా ఉంటుంది. ఇక్కడకు ఒకసారి వచ్చిన వారు జీవితాంతం ఈ జ్ఞాపకాలను తమ హృదయంలో ఉంచుకుంటారు. భద్రతా కారణాల దృష్ట్యా ఇప్పుడు ఈ గ్రామాల మధ్య కొన్ని పరిమితమైన కండిషన్స్ అమలులో ఉన్నాయి. అయితే స్థానిక ప్రజలు ఇప్పటికీ ఆ పాత సోదరభావాన్ని గుర్తుంచుకుంటారు. కరోన్ లోయ అందాలకు కూడా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రదేశం సహజ సౌందర్యం చాలా అద్భుతంగా ఉంటుంది. ఇక్కడకు ఒకసారి వచ్చిన వారు జీవితాంతం ఈ జ్ఞాపకాలను తమ హృదయంలో ఉంచుకుంటారు.

4 / 8

భారతదేశం, పాకిస్తాన్ మధ్య ఉన్న ఈ కొండ ప్రాంతం స్వర్గంలా అందంగా కనిపిస్తుంది. పర్వతాలు, పచ్చదనం, నదులు, చాలా ప్రశాంతత ఉన్న చోట. కరణ్ వ్యాలీకి సంబంధించిన అత్యంత ప్రత్యేకమైన విషయం ఏమిటంటే ఇక్కడ జనసమూహం లేదా హారన్ల శబ్దం ఉండదు. పక్షుల కిలకిలరావాలు, ప్రవహించే నది గర్జన శబ్దం, పచ్చని పర్వతాల నీడ మాత్రమే మీకు లభిస్తుంది. భారతదేశం, పాకిస్తాన్ మధ్య ఉన్న ఈ కొండ ప్రాంతం స్వర్గంలా అందంగా కనిపిస్తుంది. పర్వతాలు, పచ్చదనం, నదులు, చాలా ప్రశాంతత ఉన్న చోట. కరణ్ వ్యాలీకి సంబంధించిన అత్యంత ప్రత్యేకమైన విషయం ఏమిటంటే ఇక్కడ జనసమూహం లేదా హారన్ల శబ్దం ఉండదు. పక్షుల కిలకిలరావాలు, ప్రవహించే నది గర్జన శబ్దం, పచ్చని పర్వతాల నీడ మాత్రమే మీకు లభిస్తుంది.

5 / 8

ఇక్కడి లోయలు చాలా పచ్చగా, విశాలంగా ఉన్నాయి. మీరు సినిమా సెట్ మీద నిలబడి ఉన్నట్లు అనిపిస్తుంది. ఇక్కడ సాంప్రదాయ చెక్క ఇళ్ళు, పొలాల్లో పనిచేసే వ్యక్తులు, ఎత్తైన పర్వతాలను చూస్తారు. ఇక్కడి లోయలు చాలా పచ్చగా, విశాలంగా ఉన్నాయి. మీరు సినిమా సెట్ మీద నిలబడి ఉన్నట్లు అనిపిస్తుంది. ఇక్కడ సాంప్రదాయ చెక్క ఇళ్ళు, పొలాల్లో పనిచేసే వ్యక్తులు, ఎత్తైన పర్వతాలను చూస్తారు.

6 / 8

ఈ లోయ గుండా కిషన్ గంగా నది ప్రవహిస్తుంది. ఇది ఈ ప్రాంత అందాన్ని మరింత పెంచుతుంది. నదిలోని స్వచ్ఛమైన,చల్లని నీరు స్ఫటిక నీలం రంగులో కనిపిస్తుంది. దీని ఒడ్డున కూర్చుని సూర్యాస్తమయాన్ని చూడటం ఒక చిరస్మరణీయ అనుభవంగా మారుతుంది. ఈ లోయ గుండా కిషన్ గంగా నది ప్రవహిస్తుంది. ఇది ఈ ప్రాంత అందాన్ని మరింత పెంచుతుంది. నదిలోని స్వచ్ఛమైన,చల్లని నీరు స్ఫటిక నీలం రంగులో కనిపిస్తుంది. దీని ఒడ్డున కూర్చుని సూర్యాస్తమయాన్ని చూడటం ఒక చిరస్మరణీయ అనుభవంగా మారుతుంది.

7 / 8

కరణ్ వ్యాలీకి సమీప విమానాశ్రయం శ్రీనగర్. ఇది ఇక్కడి నుంచి దాదాపు 110 కి.మీ. దూరంలో ఉంది. మీరు శ్రీనగర్ నుంచి కుప్వారాకు టాక్సీ లేదా స్థానిక రవాణా ద్వారా ప్రయాణించవచ్చు. దీని తరువాత కుప్వారా నుంచి కొండ రోడ్ల ద్వారా వాహనాల ద్వారా చేరుకోవచ్చు. ఆ దారి కొంచెం కష్టమే.. అయితే అక్కడికి చేరుకున్నప్పుడు మీ అలసట అంతా మర్చిపోతారు. ఈ ప్రదేశం %ూుజ% కి సమీపంలో ఉంది.. కనుక ఇక్కడికి వెళ్లే ముందు స్థానిక గైడ్ అనుమతి, సహాయం తప్పనిసరి. ముందు స్థానిక గైడ్ అనుమతి, సహాయం తప్పనిసరి.